క్లుప్తంగా

ఉపాధి కూలీలకు పట్టల పంపిణీ



కూలీలకు టార్పాలిన్ పట్టలు అందజేస్తున్న సర్పంచు, వైఎస్సార్‌సీపీ నాయకులు

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో ఉపాధి కూలీలకు పనుల వద్ద సర్పంచు వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు రామలింగేశ్వరరెడ్డి సోమవారం పట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు వలసలు వెళ్లకుండా ప్రభుత్వం కల్పించిన ఉపాధి పనులకు కూలీలు వెళ్తున్నారన్నారు. ప్రస్తుతం ఎండలు విపరీతంగా ఉన్నాయని, కొన్ని చోట్ల కూలీలు కుర్చునేందుకు చెట్లు లేకపోవడంతో విలవిల్లాడుతున్నారన్నారు. కొంత మేర సేదతీరేందుకు ఉపయోగడతాయన్న ఉద్దేశంతో పట్టలు అందజేశామని తెలిపారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేశ్వరరెడ్డి ఉన్నారు.

బీమా సాయం అందజేత

పగిద్యాల: మండల కేంద్రంలోని మాడెపోగు జాన్ అనే వ్యక్తి ఈ నెల 16న గుండెపోటుతో మృతి చెందాడు. సోమవారం సర్పంచు పెరుమాళ్ శేషన్న, ఈఓపీఆర్డీ పుల్లయ్య బీమా సాయం కింద రూ.10,000 నగదును మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ నరసింహులు, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి, వలంటీర్ మనీషా తదితరులు పాల్గొన్నారు.

పశు గ్రాసం దగ్ధం

కొత్తపల్లి: ట్రాక్టర్‌లో తరలిస్తున్న పశు గ్రాసం ప్రమాదవశాత్తు దగ్ధమైన ఘటన సోమవారం మండలంలోని ఎదురుపాడు గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ఎదురుపాడు గ్రామానికి చెందిన రైతు శ్రీకాంత్ పగిద్యాల మండలం వనములపాడు గ్రామానికి పశువుల మేత కోసం వరి గడ్డిని కోనుగోలు చేశాడు. గ్రామానికి తీసుకొని వస్తుండగా గ్రామంలో దిగువకు ఉన్న విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగాయి.గమనించిన డ్రైవర్ గోవర్ధన్ ట్రాక్టర్‌ను వేగంగా గ్రామం వెలుపలికి తీసుకెళ్లి లిఫ్ట్ ఎత్తడంతో గడ్డి కిందకు పడిపోయింది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.

ఏఎన్‌ఎంను సస్పెండ్ చేయాలి

నందికొట్కూరు: ఆశా వర్కర్‌ను వేధింపులకు గురిచేసిన ఏఎన్‌ఎం సావిత్రిని సస్పెండ్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కరరెడ్డి కోరారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి అర్బన్ హెల్త్ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్ నజిరున్నీసాను వేధించిన ఏఎన్ఎంపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. 17 ఏళ్ల నుంచి ఆశా వర్కర్‌గా పని చేస్తున్న మహిళను ఇబ్బందులకు గురి చేయడం దారుణమన్నారు. చిన్న రిమార్క్ లేకుండా పని చేసిన ఆశా వర్కర్ వేధించడంతో ఆత్మహత్యా యత్నానికి పాల్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కిషోర్‌కు, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులకు వినతి పత్రం అందజేశారు.కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఫక్కీర్‌సాహెబ్, జయమ్మ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు నాగమణి, లక్ష్మి, మంజుల, మధులత పాల్గొన్నారు.

పేద ముస్లింలకు రంజాన్ తోఫా



ముస్లింలకు కిట్లను అందిస్తున్న సర్పంచ్, కన్వీనర్

మహానంది: రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా బొల్లవరం గ్రామంలోని పేద ముస్లింలకు సర్పంచ్ షేక్ జమాల్‌బీ, సచివాలయ కన్వీనర్ షేక్ షరీఫ్ ఆధ్వర్యంలో సోమవారం రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు. 180 కుటుంబాల వారికి కానుకల కిట్లను అందించారు. అనంతరం దాతలు మాట్లాడుతూ రంజాన్ మాసంలో సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

అత్యవసర సమావేశం నిర్వహించాలి

ఆత్మకూరు: పట్టణంలో మంచినీటి ఎద్దడి నివారించేందుకు వెంటనే మున్సిపల్ కార్యాలయంలో అత్యవసర సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయాలని వార్డు కౌన్సిలర్లు లక్ష్మమ్మ, యూనస్, నూర్జహాన్, పార్వతి, విజయ్‌కుమార్, షేక్షావలి, సుల్తాన్ కోరారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో ఇటీవల నీటి సమస్య అధికమైందని, ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. 4 రోజులకు ఒకసారి నీటిని విడుదల చేయడం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సత్వరమే సమావేశం ఏర్పాటు చేసి నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుకు, చైర్మన్, ఆసియామారూఫ్‌లకు వినతిపత్రాలు అందజేశారు.

పర్యవేక్షణా లోపం.. నాణ్యతకు తిలోదకం

- పాఠశాలలకు ఇష్టానుసారంగా గుడ్ల సరఫరా
- నాణ్యత లేకపోవడంతో పారవేయాల్సిన పరిస్థితి
- లోపించిన అధికారుల పర్యవేక్షణ



పారుమంచాల పాఠశాల వెనుక పారవేసిన వందలాది గుడ్లు

జూపాడుబంగ్లా: ప్రభుత్వం రూ.లక్షల నిధులను వెచ్చించి పాఠశాలల్లోని విద్యార్థులకు జగనన్నగోరుముద్ద పేరుతో నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తోంది. అయితే కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల విద్యార్థులకు అందాల్సిన బలవర్ధకమైన ఆహారం అందకుండా పోతుందనే విమర్శలున్నాయి. పాఠశాలలకు గుడ్లను సరఫరా చేయాల్సిన కాంట్రాక్టర్ ఇష్టాను సారంగా నాణ్యతలేని వాటిని సరఫరా చేస్తుండటంతో పారవేయాల్సి వస్తోంది. ఫలితంగా విద్యార్థులకు పూర్తి స్థాయిలో గుడ్లు అందడంలేదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వారానికి 2,130 గుడ్ల సరఫరా

మండలంలోని పారుమంచాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 426 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వారికి వారంలో 5 రోజులపాటు మధ్యాహ్న భోజనంతో పాటు ఉడకబెట్టిన గుడ్లును ఇవ్వాల్సి ఉంది. రోజుకు 426 గుడ్ల చొప్పున ఐదురోజులకు 2,130గుడ్లను సరఫరా చేయాల్సి ఉంది. వారాని కోపర్యాయం గుడ్లను సరఫరా చేయాల్సిన కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ తక్కువ బరువు ఉన్న నాసిరకమైన గుడ్లను సరఫరా చేస్తున్నాడని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. ప్రతి రోజు ఉడకబెట్టే సమయంలో వాటని నీళ్లల్లో వేస్తుంటే పాడైన గుడ్లు నీళ్లపై తేలుతుంటాయని, వాటిని తొలగించి నాణ్యమైన వాటిని మాత్రమే ఉడకబెడ్తున్నట్లు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. తీవ్రమైన ఎండల ధాటికి కూడా కాంట్రాక్టర్ సరఫరా చేసిన గుడ్లు పాడవుతున్నాయనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. విద్యార్థులకు అందాల్సిన వందలాది గుడ్లు పాడవ్వటంతో వాటిని పాఠశాల వెనుక కాల్వలో పారవేశారు.

ఒక్కో గుడ్డు రూ.5

ఒక్కో గుడ్డుకు ప్రభుత్వం రూ.5ల చొప్పున వెచ్చిస్తుండగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారులు పర్యవేక్షణ లోపం వల్ల అవి సక్రమంగా విద్యార్థులకు అందకుండా పోతున్నాయి. విద్యార్థులకు అందాల్సిన వందలాది గుడ్లు నేలపాలైన విషయమై అధికారులు చర్యలు తీసుకొని పూర్తిస్థాయిలో విచారణ జరిపి విద్యార్థులకు సక్రమంగా నాణ్యమైన గుడ్లు అందేలా చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాడైన గుడ్లు లెక్కల్లోంచి తీసివేస్తాం

ప్రతి రోజు గుడ్లు ఉడకబెట్టే సమయంలో గుడ్లను నీళ్లల్లో వేస్తాం. పాడై నీళ్లపైకి తేలిన గుడ్ల లెక్కను కాంట్రాక్టర్‌కు తెలియజేసి వాటిని పారవేస్తాం. వందలాది గుడ్లు పారవేసిన విషయమై ప్రస్తావించగా వాటిని లెక్కల్లోంచి తీసివేస్తామని తెలిపారు.

– సువర్ణమ్మ, హెచ్‌ఎం

మహానందీశ్వరుడికి పల్లకీసేవ



పల్లకీలో విహరిస్తున్న మహానందీశ్వరుడు

మహానంది: మహానందిలో వెలిసిన శ్రీ కామేశ్వరి, మహానందీశ్వరస్వామి వార్లకు సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఆలయ వేదపండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో స్థానిక అలంకార మండపంలో ఉత్సవమూర్తులకు గణపతిపూజ, పుణ్యాహవాచనం, మహా మంగళహారతులు, అలంకార పూజలు చేపట్టారు. అనంతరం నాలుగుదిక్కుల్లో బలిహరణ పూజల అనంతరం ఆలయ ప్రాకారంలో పల్లకీ ఉత్సవం జరిపారు. వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించుకున్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

మిడుతూరు: మిడుతూరు గ్రామ సచివాలయం -2 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జీఎన్‌ఎస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ హాజరవుతారని చెప్పారు. అధికారులు ప్రజాప్రతినిధులు హాజరు కావాలని సూచించారు.

నవరత్నాలతో ప్రజల్లో సంతృప్తి

ఆత్మకూరు: రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంజూరు చేసిన నవరత్న పథకాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్ కో ఆప్షన్‌సభ్యుడు రషీద్‌లు అన్నారు. పట్టణంలోని 3వ వార్డులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి అందిస్తున్న సంక్షేమ పథకాలు ఇంటింటా అందడం వలన ప్రజలు సంతోషంగా తమ ఇళ్ల వద్ద స్టిక్కర్లను అతికించుకుంటున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు యనస్, షాలుపైల్మాన్, కన్వీనరు పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. సోమ వారం పాములపాడు, మజరా కంబాలపల్లి గ్రామంలో సొసైటీ చైర్మన్ చౌడయ్య, కోఆప్షన్ మెంబర్ ముర్తుజావలి, వైఎస్సార్‌సీపీ నాయకురాలు రాములమ్మ, తుమ్మలూరులో సర్పంచు వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు రామలింగేశ్వరరెడ్డి కార్యక్రమాన్ని కొనసాగించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రజలతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన గురించి అడిగారు. ప్రజలు అధిక సంఖ్యలో సంతృప్తి వ్యక్తం చేస్తుండటంతో నాయకులు మరింత ఉత్సాహంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

మహానందిలో మూడు మినరల్ వాటర్ ప్లాంట్లు



వాటర్‌ప్లాంట్ల ఏర్పాటుకు పూజలు చేస్తున్న చైర్మన్, వేదపండితులు

మహానంది: మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చే భక్తుల దాహార్తిని తీర్చేందుకు మూడు మినరల్ వాటర్ ప్లాంట్లు (గంగా జల ప్రసాద కేంద్రాలు) ఏర్పాటు చేస్తున్నట్లు ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాల మహేశ్వరరెడ్డి తెలిపారు. మహానందిలో సోమవారం వేదపండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో ప్లాంట్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ దాతల సహకారంతో భక్తులకు సౌకర్యంగా ఉండేందుకు ఆలయ ప్రాంగణంలోని మూడు ప్రాంతాల్లో నీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ వై.మధు, సూపరింటెండెంట్లు ఓంకారం వెంకటేశ్వరుడు, అంబటి శశిధర్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శరభారెడ్డి పాల్గొన్నారు.

మహానందిలో గ్రీనింగ్ అభివృద్ధికి సహకరించాలి



చైర్మన్ నాగేశ్వర్‌ను కలిసిన నాగభూపాల్ రెడ్డి

మహానంది: రాష్ట్రంలోని ప్రముఖ శైవక్షేత్రమైన మహానందిలో గ్రీనింగ్ అభివృద్ధి పనులు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ రాష్ట్ర చైర్మన్ చందన నాగేశ్వర్‌ను కోరినట్లు ఆ శాఖ రాష్ట్ర డైరెక్టర్ బసిరెడ్డి నాగభూపాల్‌రెడ్డి తెలిపారు. నూతనంగా సోమవారం ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ రాష్ట్ర చైర్మన్‌గా ఎన్నికై ప్రమాణస్వీకారం చేసిన చైర్మన్ చందన నాగేశ్వర్‌ను అమరావతిలోని కార్యాలయంలో కలిసి వివిధ అంశాలపై చర్చించారు. భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో ప్రముఖ శైవక్షేత్రమైన మహానంది అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశానన్నారు. వచ్చే నెలలో రాష్ట్ర డైరెక్టర్లతో సమావేశం ఉందని, సమావేశంలో చర్చించి తప్పకుండా ప్రణాళికలు రూపొందిస్తామని హామీ ఇచ్చారన్నారు.

మల్లన్నకు సహస్రదీపార్చన సేవ



స్వామిఅమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: జ్యోతిర్లింగక్షేత్రమైన శ్రీశైలమహాక్షేత్రమైన శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. ముందుగా దేవాలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. ఈ సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాధికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథం పై ఆశీనులు చేసి ఆలయ ప్రదక్షిణ చేయించారు.

శనగల బసవన్నకు పూజలు

స్వామి అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో శనగల బసవన్నగా పేరొందిన నందీశ్వరుడికి సోమవారం త్రయోదశి సందర్భంగా పరోక్ష సేవను అర్చకులు, ఈఓ లవన్న విశేషపూజలను నిర్వహించారు. నందీశ్వర స్వామికి నూతన వస్త్ర సమర్పణ, నానబెట్టిన శనగలను మహా నైవేద్యంగా సమర్పించారు.

నేడు శ్రీశైలానికి ఎస్టీ కమిషన్ చైర్మన్ రాక

శ్రీశైలంటెంపుల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంబ రవిబాబు, సభ్యులు శంకర్‌నాయక్ మంగళవారం మధ్యాహ్నం శ్రీశైలం రానున్నారు. ఉదయం 9.30 గంటలకు రోడ్డు మార్గం ద్వారా బయల్దేరి మధ్యాహ్నం 1.30 గంటలకు శ్రీశైలం చేరుకుంటారు. భ్రమరాంబాఅతిథి గృహంలో భోజన విరామం అనంతరం ఇటీవల అనుమానస్పద స్థితిలో మృతి చెందిన శ్రీశైలం ఎస్టీ కాలనీకి చెందిన సంతోష్‌నాయక్ ఇంటికి చేరుకుని వారి కుటుంబసభ్యులతో మృతికిగల కారణాలను చర్చించనున్నారు. అనంతరం 4 గంటలకు విజయవాడ తిరుగు ప్రయాణమవుతారు.

జగనన్నతోనే సంక్షేమం

కొత్తపల్లి: జగనన్నతోనే ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందని సర్పంచ్ మశమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు సోమల శ్రవంతి అన్నారు.సోమవారం మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామ పంచాయతీలోని మజరా గ్రామాలైన చదరంపెంట, ఎర్రగుంట, పాలెంచెదరువు గిరిజన గూడెలలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. గూడెలలో ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. వారి అనుమతితో స్టిక్కర్లను అతికించారు. ప్రజలందరూ జగనన్నను మరొకసారి ఆదరిస్తే రాష్ట్ర ప్రజలకు సంక్షేమపాలన అందిస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సోమల రవీంద్రారెడ్డి, సోమల రామిరెడ్డి, చంద్రమౌళి, వెంకటేష్, మల్లయ్య పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

బండిఆత్మకూరు :రంజాన్ మాసం సందర్భంగా కులమతాలకతీతంగా చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ జిల్లా అధ్యక్షుడు మస్తాన్ కరిముల్లా తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం బండిఆత్మకూరు గ్రామంలో వంద మంది మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగను పేద ముస్లింలు కూడా సుఖసంతోషాలతో జరుపుకోవాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఏడాది కేరళ ముస్లిం కల్చర్ సహకారంతో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఐయూఎంఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మౌలానా రఫివుద్దీన్, నంద్యాల జిల్లా అధ్యక్షురాలు మొహాసీనా జహిరా బేగం, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బాస్ వలి, మండల మహిళా అధ్యక్షురాలు రసూలాబీ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి అందరూ సహకరించాలి

- మళ్లీ సీఎం కావాలని వైఎస్ జగనన్నను దీవించండి
- ఎమ్మెలే తొగురు ఆర్థర్
- పట్టణంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

నందికొట్కూరు: రాష్ట్రాభివృద్ధికి అందరూ సహకరించాలని ఎమ్మెల్యే తొగరు ఆర్థర్ కోరారు. సోమవారం పట్టణంలోని 10వ సచివాలయం పరిధిలో సంగయ్యపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. వైఎస్ జగనన్న మళ్లీ సీఎం కావాలని ప్రజలు దీవించాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజలను సమస్యలు ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నా రు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, ఇళ్ల స్థలాలు, పక్కాగృహాలు మంజూరు చేయాలని స్థానికులు ఎమ్మెల్యేదృష్టికి తెచ్చారు.

బీసీలను మోసం చేసిన చంద్రబాబు

బీసీ కులాల ఓట్లు వేయించుకున్ని మోసం చేసిన చరిత్ర చంద్రబాబుకు ఉందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు పెద్ద పీట వేశారని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సీఎం వైఎస్ జగనన్న వెంట ఉన్నారని ఓర్వలేక చంద్రబాబు విషం చిమ్ముతున్నారన్నారు. నిరుద్యోగ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్రంలో పెద్ద ఎత్తున్న పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు ఇస్తుందని చెప్పారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో జగనన్న కాలనీల నిర్మాణాలు చూసి చంద్రబాబుకు వణుకుపట్టిందన్నారు. జగనన్న సంక్షేమ పథకాలను బాబుకు పిచ్చిక్కిందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ కిషోర్, మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, సహకార సొసైటీ చైర్మన్ హుసేనయ్య, కౌన్సిలర్లు జాకీర్ హుసేన్, వైఎస్సార్‌సీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, విక్టర్, మహేష్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో సమస్యల పరిష్కారం

కొత్తపల్లి: స్పందనలో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. భూసర్వేకు సంబంధించి నలుగురు రైతులు అర్జీలు అందజేశారని, సంబంధిత అధికారులతో చర్చించి సర్వే చేయించి సమస్య పరిష్కరిస్తామన్నారు.

'బీజేపీని ఇంటికి పంపిద్దాం'



లింగాలలో ఉపాధి కూలీలతో సీపీఎం జీపుజాతా

పాములపాడు: కార్మిక, రైతు, ఉపాధి కూలీలకు వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీజేపీని ఇంటికి పంపిద్దాం అని సీపీఎం మండల కార్యదర్శి స్వామన్న అన్నారు. సోమవారం మండలంలోని మిట్టకందాల, మద్దూరు, వాడాల, లింగాల, చెలిమిల్ల గ్రామాల్లో జీపు జాతాకార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం సామాన్య ప్రజలపై పెనుభారం మోపుతూ కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హనుమంతు, ఏసేపు, బాలయేసు, రమణ, రబ్బమ్మ, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

మే 10 వరకు సాగు నీరు అందించాలి

బండిఆత్మకూరు: తెలుగుగంగ ప్రధాన కాల్వకు మే 10వ తేదీ వరకు సాగు నీరు ఇచ్చి రైతుల పంటలను కాపాడాలని సీపీఎం డివిజన్ నాయకులు రాజశేఖర్ తెలిపారు. సోమవారం బండిఆత్మకూరు బస్టాండ్‌లో రైతులతో ఆందోళన నిర్వహించారు. దీంతో నంద్యాల– ఆత్మకూరు వైపు వెళ్లే వాహనాలకు అంతరాయం ఏర్పడింది. పంట చివరి దశకు వచ్చిందని, వెలుగోడు రిజర్వాయర్‌లో ఉన్న నీటిని ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రత్నమయ్య, రామచంద్రుడు, డేవిడ్, రాజేష్, నాగరత్నం పాల్గొన్నారు.

జాతీయోద్యమ స్ఫూర్తితో ఉద్యమిద్దాం

వెలుగోడు: జాతీయోద్యమ స్ఫూర్తితో ఉద్యమించాల్సిన అవసరం ఉందని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.రామదాస్ అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం, సీపీఐ ప్రచార భేరీ పోస్టర్‌ను సోమవారం ప్రజా సంఘాల నాయకులు ఆవిష్కరించారు. రామదాస్ మాట్లాడుతూ.. దేశంలోని ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రతి ఒక్క వ్యక్తి గొంతెత్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీసే సమయం వచ్చిందన్నారు. లేదంటే దేశ భవిష్యత్తు చిమ్మ చీకటి అయిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 30 వరకు సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాలు జరుగుతున్నాయని, ప్రజలు ఇందులో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు వాదం నాగ మోహన్, నాయకులు వెంకటయ్య, ఎర్ర బాషా, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆత్మకూరు: అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక కేంద్రం అధికారి భీముడు నాయక్ చెప్పారు. పట్టణంలోని చైతన్య ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో సోమవారం అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటే స్థానిక ఫైర్‌స్టేషన్ కు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రమాదాల నివారణ కు అగ్నిమాపక సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారని, అన్ని అత్యవసర వేళల్లో తాము సహాయంగా ప్రజలకు సేవలందిస్తామన్నారు. అనంతరం అగ్నిప్రమాదాలు నివారణపై విద్యార్థులతో విన్యాసాలను ప్రదర్శించారు.

చెంచులు విద్యాభివృద్ధి సాధించాలి



చెంచులకు దుస్తులు, స్వీట్లు పంపిణీ చేస్తున్న టీచర్ నూరుల్లా

జూపాడుబంగ్లా: చెంచులు విద్యాపరంగా వృద్ధిసాధించాలని ఉపాధ్యాయుడు నూరుల్లా తెలిపారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం ఉపాధ్యాయుడు నూరుల్లా వెదురుపాడు, పాతమాడుగులగూడెంకు చెందిన 30 చెంచు కుటుంబాలకు దుస్తులు, స్వీట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ చెంచులు అందరూ వారి పిల్లలను చదివించుకోవాలని, వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో ఐటీడీఏ సీసీ స్వాములు, యూసూఫ్ తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవలతోనే గుర్తింపు



మధుమోహన్‌ను సన్మానిస్తున్న తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, కార్యాలయ సిబ్బంది

జూపాడుబంగ్లా: నిస్వార్థంగా విధులు నిర్వర్తించినప్పుడే ఉద్యోగికి ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ తెలిపారు. జూనియర్ అసిస్టెంటుగా పదోతన్నతి పొందిన ఆఫీసు సబార్డినేట్ మధుమోహన్‌ను సోమవారం కార్యాలయ సిబ్బందితో కలిసి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ కార్యాలయంలో ఆఫీసు సబార్డినేట్‌గా విధులు నిర్వర్తిస్తున్న మధుమోహన్ జూనియర్ అసిస్టెంటుగా పదోన్నతి పొందటం హర్షించదగిన విషయమన్నారు. కర్నూలు కలెక్టర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంటుగా నియమించబడిన మధుమోహన్ డిప్యూటేషన్‌పై సి.బెళగల్ మండలంలో విధులు నిర్వహించేలా జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాగన్న, సీనియర్ అసిస్టెంటు శ్రీరంగారెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

బండిఆత్మకూరు: పెద్దదేవళాపురం గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన మలిరెడ్డి బాల వెంకటరెడ్డి అనే రైతు తన బైక్‌పై గ్రామానికి వస్తున్నారు. అదే సమయంలో వెనుకనుంచి వచ్చిన లారీ ఢీకొట్టడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. కాలుకు, తలపై తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోమియోపతి పితామహుడికి నివాళి



శామ్యూల్ హానెమాన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దశ్యం

వెలుగోడు: ప్రపంచ హోమియోపతి దినోత్సవాన్ని పురస్కరించుకొని హోమియోపతి వైద్యశాస్త్ర పితామహుడు శామ్యూల్ హానెమాన్‌కు ఘనంగా నివాళులర్పించారు. హోమియోపతి వైద్యనిపుణులు డాక్టర్ కిస్టిపాటి శేషఫణి శర్మ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముందుగా శామ్యూల్ హానెమాన్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శేషఫణి మాట్లాడుతూ.. హోమియోపతి ద్వారా దీర్ఘకాలిక నొప్పి, అలెర్జీలు, జీర్ణ రుగ్మతలతో సహా అనేక విభిన్న పరిస్థితులకు చికిత్స చేయడంలో ప్రభావవంతంగా ఉన్నట్లు చూపబడిందన్నారు. డిగ్రీ కాలేజీ రిటైర్డు ప్రిన్సిపాల్ డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, డబ్ల్యూ.చంద్రశేఖర్‌రెడ్డి, ఇసుగూరి శ్రీనివాసులు, నసిరుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.